RNI: TELTEL12215

https://youtube.com/@PrabhathasuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :206 EDITOR: CHERUKU UPENDAR, DATE : SUNDAY 11 DECEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 206 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : సోమవారం 11 డిసెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## సికింద్రాబాద్ నుంచి మరో వందేభారత్ రైలు!



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: సికింద్రాబాద్ నుంచి ఇప్పటికే రెండు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. ఒకటి సికింద్రాబాద్-విశాఖ మార్గంలో మరొకటి సికింద్రాబాద్-తిరుపతి మార్గంలో నడుస్తున్నాయి. ఇప్పుడు మరో వందేభారత్ రైలు సికింద్రాబాద్ నుంచి పరుగులు తీయనుంది. ఈ కొత్త వందేభారత్ రైలు సికింద్రాబాద్ నుంచి

మిగతా 2లో

## 19న 'ఇండియా' ఫోరమ్ నేతల భేటీ

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు




ఇండియా ఫోరమ్ నేతల భేటీ ఈ నెల 19న ఢిల్లీలో జరగనుంది. ఈసారి కాంగ్రెస్ ఆచితూచి వ్యవహరించాల్సి ఉంటుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ మూడు రాష్ట్రాల్లో ఘోర పరాజయం పాలైన దరిమిలా ఒంటెత్తు పోకడలు పోతామంటే కుదరదు. మిత్రులను సమ భాగస్వాములుగా పరిగణించి అందరితోనూ సఖ్యతగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లో బిజెపి ఘన విజయం సాధించింది. దీంతో ప్రధాన ప్రతిపక్షం, ఇండియా

## డర్బన్‌లో వర్షం.. టాస్ ఆలస్యం..

హైదరాబాద్



అందరి చూపు సుప్రీం వైపే నేడు ఆర్టికల్ 370పై తీర్పు

%ణవవషెవఎఎవతీ 11, 2023 1:37 ఖఎ

చాశ్రీశ్రీ వఎవం ఖతీవ శీఅ్‌ ష్త్రవ

రాబజూతీవఎవ జీబన్త్రఎవత్‌ శీఅ

చాతీఱఎశ్రీవ 370్‌ శీఝఎ%శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్ ప్రజలే కాదు%ౌ%ఇప్పుడు దేశ ప్రజలందరూ సుప్రీంకోర్టు వైపే ఉత్కంఠగా చూస్తున్నారు. ఆర్టికల్ 370

## వేగవంతంగా విమానాశ్రయాల విస్తరణ

- వెయ్యేళ్ల చరిత్ర గల రాజమహేంద్రవరం దేశానికే తలమానికం
- టెర్మినల్ భవన నిర్మాణ శంకుస్థాపనలో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా




రాజమహేంద్రవరం- ప్రభాత సూర్యుడు

దేశంలో విమానయాన రంగాన్ని వేగవంతంగా అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగానే మధురపూడి ఎయిర్ పోర్టులో రూ.347 కోట్లతో టెర్మినల్ భవనం విస్తరణకు శ్రీకారం చుట్టామని కేంద్ర విమానయాన, ఉక్కు శాఖ మంత్రి జ్యోతి రాదిత్య సింధియా అన్నారు. మధురపూడి విమానా శ్రయంలో టెర్మినల్ భవన విస్తరణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వెయ్యేళ్ల ఉత్సవాలు చేసుకుంటున్న రాజమహేంద్రవరం నగర సాంస్కృతిక వారసత్వం దేశానికే తలమా నికమన్నారు. 2014 నాటికి దేశంలో 74

మిగతా 2లో

# కేసీఆర్ త్వరగా కోలుకోవాలి




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

త్వరగా కోలుకుని అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనాలని కెసిఆర్‌ను కోరా అని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గురువారం అర్ధరాత్రి ఎర్రవల్లి నివాసంలోని బాత్‌రూంలో కెసిఆర్ జారిపడటంతో ఎడమ తుంటికి తీవ్ర గాయమైన సంగతి తెలిసిందే. సోమాజిగూడలోని యశోద ఆసుపత్రి వైద్యులు ఆయనకు శుక్రవారం రాత్రి తుంటి మార్పిడి శస్త్రచికిత్స చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్న వైద్యులు శనివారం వాకర్ సాయంతో నెమ్మదిగా అడుగులు వేయించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో ఉన్న బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌ను సిఎం రేవంత్ వ రా వు ర్శిం చా రు. మంత్రి సీతక్క

మిగతా 2లో

## రేవంతే టీపీసీసీ చీఫ్

### పార్లమెంటు ఎన్నికల తర్వాతే కాంగ్రెస్‌కు నూతన సారథి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక టీపీసీసీ నూతన రథసారధి ఎవరవుతారనే చర్చ మొదలైంది. పార్లమెంటు ఎన్నికల తర్వాతే టీపీసీసీ అధ్యక్షున్ని అధిష్టానం నియమిస్తుందని పార్టీ వర్గాలు తెలిపాయి. రేవంత్ సారధ్యంలోనే పార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయని తెలిపాయి. ఏఐసీసీ అధిష్టానం కూడా పార్లమెంటు ఎన్నికల వరకు అధ్యక్షున్ని మార్చేది లేదని తేల్చి చెప్పినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి తర్వాత సమర్థవంతమైన నాయకుడెవరు? అనే చర్చలు సాగుతున్నాయి. ఏ సామాజిక తరగతికి ఇస్తారు? అనేది కూడా చర్చనీ యాంశమవు తున్నది. గతంలో

మిగతా 2లో



## సినిమాటోగ్రఫీ, ఆర్ అండ్ బి శాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కోమటిరెడ్డి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

నల్గండ అసెంబ్లీ బరిలో దిగి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి మంత్రివర్గంలో చోటు లభించిన సంగతి తెలిసిందే. ఆయనకు సినిమాటోగ్రఫీ, ఆర్ అండ్ బి శాఖలు అప్పగించారు. ఆదివారం ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని తన చాంబర్ లో వేద పండితుల ఆశీర్వచనాల మధ్య మంత్రిగా తన కార్యకలాపాలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను సినిమాటోగ్రఫీ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక సినీ రంగం నుంచి దిల్ రాజు తప్ప మరెవరూ ఫోన్ చేయలేదని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. తనకు మంత్రి పదవి ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి కఅతజ్ఞతలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు. ఇవాళ పలు కీలకమైన ఫైళ్లపై సంతకాలు చేసినట్టు తెలిపారు. కాగా, వెంకట్ రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఆయన సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా హాజరయ్యారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు.

### అందరి చూపు సుప్రీం వైపే

# నేడు ఆర్టికల్ 370పై తీర్పు

శ్రీనగర్- ప్రభాత సూర్యుడు



జమ్మూకాశ్మీర్ ప్రజలే కాదు ఇప్పుడు దేశ ప్రజలందరూ సుప్రీంకోర్టు వైపే ఉత్కంఠగా చూస్తున్నారు. ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు సోమవారం చారిత్రాత్మక తీర్పు ఇవ్వబోతోంది. రాజ్యాంగంలోని 370వ అధికరణాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం 2019 ఆగస్ట్ ఐదవ తేదీన రద్దు చేసిన విషయం తెలిసిందే. తమ ప్రాంతానికి గతంలో కల్పించిన ప్రత్యేక ప్రతిపత్తిని ఈ తీర్పు ద్వారా అత్యున్నత న్యాయస్థానం తిరిగి కొనసాగిస్తుందని జమ్మూకాశ్మీర్ ప్రజలు ఆశాభావంతో ఉన్నారు.

ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో 20కి పైగా పిటిషన్లు దాఖలయ్యాయి. పదహారు రోజుల విచారణ అనంతరం సెప్టెంబర్ ఐదున న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలో న్యాయమూర్తులు సంజరు కిషన్ కౌల్, సంజీవ్ ఖన్నా, బీఆర్ గవారు, సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం ఈ వ్యవహారంపై విచారణ జరిపింది. సోమవారం తీర్పు వెలువడనున్న నేపథ్యంలో శాంతి భద్రతల అదనపు డీజీపీ విజరు కుమార్ సమావేశం నిర్వహించారు. సీనియర్ పోలీస్, పౌర అధికారులు హాజరైన ఈ సమావేశంలో శాంతి భద్రతల పరిస్థితిపై చర్చించారు. తీర్పుపై తాము ఆశాభావంతో ఉన్నామని పిటిషనర్లలో ఒకరైన మాజీ పార్లమెంట్ సభ్యుడు, మాజీ న్యాయమూర్తి హస్‌నైన్ మసూదీ తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు చట్టవిరుద్ధమని, దానిని రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించాలని న్యాయస్థానాన్ని కోరామని చెప్పారు. 'కేంద్రం నిర్ణయం తీసుకోగానే న్యాయస్థానం తలుపు తట్టాము. ప్రభుత్వ నిర్ణయం మా హక్కులను కాలరాస్తోంది. న్యాయస్థానం మా అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి నివేదించింది. ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నాం. ఎందుకంటే అది రాజ్యాంగ విరుద్ధమైన చర్య' అని వివరించారు. అయితే రాష్ట్ర రాజధాని శ్రీనగర్‌లోని అనేక మంది మాత్రం తీర్పుపై పెద్దగా ఆశలు పెట్టుకోలేదు. తనకేమీ ఆశలు లేవని మాజీ మంత్రి, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ సీనియర్ నేత నయీమ్ అక్తర్ పెదవి విరిచారు. ఆర్టికల్ 370 రద్దు చట్టబద్ధతకు సంబంధించి సుప్రీంకోర్టు ఇవ్వబోయే తీర్పుపై పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అమలులో ఉన్న ప్రక్రియకు వ్యతిరేకంగా నిర్ణయం వెలువడితే అది రాజ్యాంగ విరుద్ధమవుతుందని చెప్పారు. తదనంతర పరిణామాలు, రాజకీయ మార్పిడులను సుప్రీంకోర్టు

మిగతా 2లో

## సికింద్రాబాద్ నుంచి మరో వందేభారత్ రైలు!

(మొదటిపేజీ తరువాయి)
పూణే మార్గంలో నడవనుంది. దేశంలో వందేభారత్ సెమీ హైస్పీడ్ రైళ్లకు మాంచి డిమాండ్ ఉండడంతో రైల్వే శాఖలో ఉత్సాహం వెల్లివిరుస్తోంది. ఈ నేపథ్యంలో, త్వరలోనే ఒకే రోజున 10 మార్గాల్లో వందేభారత్ రైళ్లకు ప్రధాని మోదీ వర్చువల్ గా పచ్చజెండా ఊపనున్నారు. వీటిలో సికింద్రాబాద్-పుణే రైలు కూడా ఉంది. అయితే ఇది వందేభారత్ రైలా, వందే సాధారణ్/అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైలా అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

## 19న 'ఇండియా' ఫోరమ్ నేతల భేటీ

(మొదటిపేజీ తరువాయి)
ఫోరమ్‌కు చెందిన ప్రధాన పార్టీ కాంగ్రెస్ పై సీట్ల పంపకంలో ఒత్తిడి తెచ్చే అవకాశమూ లేకపోలేదు. సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ తో విభేదాలను కాంగ్రెస్ పరిష్కరించుకోవడంతో.. ఆయన ఈ సారి సమావేశానికి హాజరుకానున్నట్లు తెలుస్తోంది.అఖిలేష్, బిహార్ సిఎం నితీష్ కుమార్ గైర్హాజరుతో డిసెంబర్ 6న జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. వచ్చే ఏడాది జరగనున్న లోక్ సభ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిని డీ కొట్టడానికి ప్రతిపక్ష నేతలు ఇండియా ఫోరమ్‌గా జతకట్టారు.

## డర్బన్‌లో వర్షం.. టాస్ ఆలస్యం..

(మొదటిపేజీ తరువాయి)
ఆరంభం నాటికి వర్షం ఆగిపోతుందని భావించినా అప్పటిదాకా లేని వర్షం సరిగ్గా టాస్ సమయానికి ముందే మొదలైంది. మూడు ఫార్మాట్ల సిరీస్‌లో భాగంగా దక్షిణాఫ్రికాకు వచ్చిన భారత్.. నేటి నుంచి మొదలుకాబోయే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడాల్సి ఉంది. సిరీస్ ముగిసిన తర్వాత వన్డేలు, టెస్టులు ఉన్నాయి. ఆస్ట్రేలియాతో స్వదేశంలో ఆడిన యువ భారత్‌తోనే భారత్ బరిలోకి దిగబోతోంది. ఆదివారం సెలవు దినం కావడంతో సఫారీ సవాల్‌ను చూద్దామనుకుని టీవీలు, ఫోన్ల ముందుకు వచ్చిన అభిమానులను వర్షం నిరాశకు గురిచేస్తోంది. డర్బన్‌లో టాస్ తిరిగి ఎప్పుడు పడనుందనేది ఇంకా స్పష్టత రాలేదు.

### వేగవంతంగా

## విమానాశ్రయాల విస్తరణ

(మొదటిపేజీ తరువాయి)
ఎయిర్ పోర్టులు ఉండగా, ఈ తొమ్మిదిన్నరేళ్లలో కొత్తగా మరో 75 ఎయిర్ పోర్టులు వచ్చాయన్నారు. దీంతో దేశంలో ఎయిర్ పోర్టుల సంఖ్య 149కి చేరిందని తెలిపారు. రానున్న కాలంలో వీటి సంఖ్య 220కి పెంచుతాన్నారు. ప్రస్తుతం మధురపూడిలో నిర్మిస్తున్న కొత్త టెర్మినల్ పాయింట్ 21.94 వేల చదరపు అడుగుల వైశాల్యం కలిగి ఉంటుందన్నారు. రద్దీ వేళల్లో 2,100 మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం ఉంటుందని తెలిపారు. ఎయిర్‌పోర్టులో ప్రస్తుతం 18 సర్వీసులు నడుపుతున్నామని, రానున్న రోజుల్లో 25 వరకు సర్వీసులను పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, మౌలిక సదుపాయాలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపి మార్గాని భరత్‌రామ్, ఎంఎల్ఏలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ సంజీవ్ కుమార్, కలెక్టర్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

## షబ్బీర్ కేసీఆర్ త్వరగా కోలుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)
అలీతో కలిసి ఆస్పత్రికి వెళ్లిన రేవంత్.. కెసిఆర్‌ను కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని మాజీ మంత్రి కెటిఆర్, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి బయట మీడియాతో సిఎం మాట్లాడారు. కెసిఆర్‌ను పరామ ర్శించాననీ.. క్రమంగా కోలుకుం టున్నారనీ చెప్పారు. ఆయన వైద్యం కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సిఎస్‌ను ఆదేశించానన్నారు. కెసిఆర్ త్వరగా కోలుకొని అసెంబ్లీకి రావాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు. మంచి ప్రభుత్వ పాలన అందించడానికి ఆయన సూచనలు అవసరం ఉందని తెలిపారు. ప్రజల పక్షాన అసెంబ్లీలో కెసిఆర్ మాట్లాడాల్సిన అవసరముందని, త్వరగా కోలుకుని అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనాలని కెసిఆర్‌ను కోరానని రేవంత్ చెప్పారు.

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



రాష్ట్రంలో పలు కార్పొరేషన్ల ఛైర్మన్ల నియామకాలను రద్దు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తం 54 కార్పొరేషన్ల ఛైర్మన్ల నియామకాలు రద్దు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. డిసెంబరు 7న కొలువుదీరిన కొత్త ప్రభుత్వం చాలా వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళ్తుంది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో నియమించిన కార్పొరేషన్ ఛైర్మన్లను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# రేవంతే టీపీసీసీ చీఫ్

(మొదటిపేజీ తరువాయి)
ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆ పదవిలో ఉండగా, ఇప్పుడు రేవంత్‌రెడ్డి కొనసాగుతున్నారు.గతంలో ఆ పదవి ఆశించిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక నేతలంతా ప్రస్తుతం రాష్ట్ర మంత్రు లయ్యారు. కీలకమైన నేతలందరికీ మంత్రి పదవులు దక్కాయి. మరో ఆరుగురికి మంత్రు లయ్యే అవకాశం ఉన్నది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరా బాద్ జిల్లాలకు ఇప్పటివరకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం దక్కలేదు. అక్కడి నుంచి సీనియర్, జూనియర్ నేతలకు మంత్రి పదవులు దక్కే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. కీలకమైన నేతలు మంత్రి పదవుల్లో ఉంటే, మిగిలిన నేతలకు టీపీసీసీ పదవి దక్కే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాలు చెప్పాయి. ఈసారి బీసీ సామాజిక తరగతికి పెద్ద పీట వేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంటు నియోజకవర్గానికి రెండు చొప్పున మొత్తం 34 సీట్లు ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎన్నికల్లో మారిన పరిస్థితుల్లో బీసీలకు 24 సీట్లు మాత్రమే దక్కాయి.దీంతో పార్టీలో ఆ సామాజికతరగతికి చెందిన కీలకమైన నేతలు కొంత అసంతృప్తి చెందుతున్నారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్ష పదవిని ఆ తరగతికి చెందిన నేతలకు ఇచ్చే అవకాశం ఉన్నట్టు చర్చ జరుగుతున్నది. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార గౌడ్, మధు యాష్కీగౌడ్, ఓబీసీ జాతీయ నేత కత్తి వెంకటస్వామిగౌడ్‌తోపాటు మరి కొంత మంది నేతలు ఈ పదవిని ఆశిస్తున్నారు. మధుయాస్కీగౌడ్ రెండుసార్లు ఎంపీగా, ఒక్కసారి ఎమ్మెల్యేగా ఓడిపోయారు. అయితే ఆయనకు జాతీయ నేతల మద్దతు ఉన్నది. ఎన్నికల సమీకరణాల రీత్యా మహేష్ కుమార్, కత్తివెంకటస్వామికి ప్రతిసారీ టికెట్లు దక్కడం లేదు.

పార్టీ బలంగా ఉంటేనే ప్రభుత్వ పథకాలు కూడా అంత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. అందుకు పార్టీపై పూర్తి పట్టు కలిగి ఉండటం, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్ట పరచడం చేయాల్సి వుంటుంది. టీపీసీసీ అధ్యక్షు లుగా ఎన్నికయ్యే నేత అటు ప్రభుత్వాన్ని, ఇటు పార్టీని సమన్వయం చేసుకుంటూ పార్టీని ముందుకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఈపరిస్థితుల్లో ఎవరివైపు అధిష్టానం మొగ్గు చూపుతుందో వేచిచూడాల్సిందే.

### అందరి చూపు సుప్రీం వైపే

# నేడు ఆర్టికల్ 370పై తీర్పు

(మొదటిపేజీ తరువాయి)
పరిగణనలోకి తీసుకుంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకప్పటి జమ్మూకాశ్మీర్ రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక హెూదా కల్పించిన ఆర్టికల్ 370ని రద్దు చేయాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం స్థానికులు, ప్రాంతీయ నాయకత్వ అభిప్రాయాలకు విరుద్ధంగా జరిగింది. జమ్మూకాశ్మీర్ రాష్ట్రాన్ని లధక్ సహా రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించారు. దీనివల్ల తమ గుర్తింపు, భద్రతకు ముప్పు కలుగుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా తీర్పుపై పిటిషనర్లలో ఒకరైన సీపీఐ (ఎం) నేత యూసఫ్ తరిగామి ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ తీర్పు మా హక్కులు, గౌరవానికి సంబంధించినది. జమ్మూకాశ్మీర్ ప్రజల హక్కులకు గ్యారంటీ ఇస్తున్న రాజ్యాంగబద్ధతకు సంబంధించినది. 2019 ఆగస్టులో జరిగింది ముమ్మాటికీ రాజ్యాంగం పైన, జమ్మూకాశ్మీర్‌ను భారత సమాఖ్యతో కలిపే బంధం పైన దాడే' అని ఆయన చెప్పారు. దీనిని కేవలం తన ఒక్కడి పిటిషన్‌గా చూడరాదని, ఇది దేశ ప్రజలందరికీ సంబంధించినదని తెలిపారు. కేంద్రం నిర్ణయంతో తమ రాష్ట్రం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా చీలిపోయిందని అంటూ తమకు న్యాయం జరగడం, రాజ్యాంగానికి రక్షణ లభించడం ఇప్పుడు ముఖ్యమని తరిగామి అన్నారు.

# మానవ హక్కులు మృగ్యం

-గాజాలో ఇజ్రాయిల్ దాష్టీకాలకు అంతం లేదా?

-మృతప్రాయమైన ఐరాస డిక్లరేషన్

-అంతర్జాతీయ సమాజం మౌనం

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు:

1948 డిసెంబర్ 10వ తేదీన ఐక్యరాజ్యసమితి ప్రపంచ దేశాలన్నింటికీ వర్తించేలా మానవ హక్కుల డిక్లరేషన్‌ను ఆమోదించింది. అయితే ఇప్పుడు దానికి అర్థమేముంది? విలువ ఏముంది? అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని అన్ని దేశాలు ఆదివారం ఘనంగా జరుపుకున్నాయి. మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామంటూ గొప్పగా ప్రతిజ్ఞలు చేశాయి. అయితే ఇజ్రాయిల్ దాడులతో భీతిల్లుతున్న గాజా నుండి వస్తున్న వార్తలు, చిత్రాలు ఈ ప్రతిజ్ఞలను అవహేళన చేస్తున్నాయి. హమాస్ మిలిటెంట్లు అక్టోబర్ 7న దాడులు జరిపి అనేక మంది ఇజ్రాయిలీలను హతమార్చిన మర్నాడే గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయిల్ యుద్ధాన్ని ప్రకటించింది. అప్పటి నుండి ఇజ్రాయిల్ దళాలు జరుపుతున్న వైమానిక దాడులు, కురిపిస్తున్న బాంబుల వర్షం కారణంగా పదిహేను వేల మంది పాలస్తీనియన్ల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వీరిలో ఆరు వేల మంది అభం శుభం తెలియని చిన్నారులేనన్న కఠోర వాస్తవం హృదయాలను కదిలించివేస్తోంది. ఇప్పుడు 1948 డిసెంబర్ 10న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ఆమోదించిన మానవ హక్కుల డిక్లరేషన్‌లో ఏముందో చూద్దాం 'మానవ కుటుంబంలోని సభ్యులందరి స్వాభావిక గౌరవానికి, సమానమైన, విడదీయరాని హక్కులకు గుర్తింపు అనేది ప్రపంచంలోని స్వేచ్ఛ, న్యాయం, శాంతికి పునాది' అని ఆ డిక్లరేషన్ తెలిపింది. అయితే మానవ హక్కుల దినోత్సవం రోజున ఆ డిక్లరేషన్ మృత ప్రాయమైపోయింది. అంతకు ముందు కూడా తమ విదేశీ విధాన లక్ష్యాలను సాధించడానికి సంపన్న, పశ్చిమ దేశాలు మానవ హక్కులను ఓ ఆయుధంగా వాడుకున్నాయన్నది సుస్పష్టం. మానవ హక్కుల డిక్లరేషన్‌కు కొద్ది నెలల ముందు ఇవే పశ్చిమ దేశాల సాయంతో ఇజ్రాయిల్ దేశం ఉనికిలోకి వచ్చింది. ఫలితంగా ఏడున్నర లక్షల మంది పాలస్తీనియన్లను తమ నివాసాల నుండి, మాతృభూమి నుండి తరిమేశారు. ఇజ్రాయిల్‌లోని 80% జనాభా దేశం నుండి బహిష్కరణకు గురికావడమో లేదా పొరుగు దేశాలకు పారిపోయి అక్కడ చెప్పుకోవడానికి తమకు దేశమన్నదేలేని స్థానికులుగా మిగిలిపోవడమో జరిగింది.



#### చలనం లేని ఇజ్రాయిల్

మానవ హక్కులను ఉల్లంఘిస్తోందని, అంతర్జాతీయ చట్టాలను బేఖాతరు చేస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నప్పటికీ ఇజ్రాయిల్ ఎంత మాత్రం చలించడం లేదు. గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ నిరంతరాయంగా యుద్ధం చేస్తోంది. సాయుధ ఘర్షణలు జరుగుతున్న ప్రాంతాలలో సైతం పౌరులకు రక్షణ కల్పించాలన్న ఐరాస ప్రాథమిక సూత్రాలను కూడా తుంగలో తొక్కుతోంది. పాలస్తీనా ప్రజల, ఆక్రమిత ప్రాంతాలలోని ఇతర అరబ్బుల మానవ హక్కులకు భంగం కలిగేలా ఇజ్రాయిల్ చేపట్టిన చర్యలపై విచారణ జరిపేందుకు ఐరాస 1968లో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. అక్రమంగా నివసిస్తున్న వారు ఆక్రమిత పాలస్తీనా ప్రాంతాలలో మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని ఇటీవల విడుదలైన ఓ నివేదిక తెలిపింది.

మానవ హక్కుల డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలంటూ 1970 డిసెంబర్ 15న ఆమోదించిన తీర్మానంలో ఐరాస సర్వసభ్య సమావేశం ఇజ్రాయిల్‌ను కోరింది. 1989లో బాలల హక్కులపై ఐరాస కన్వెన్షన్‌ను ఆమోదించారు. దీనిని 1991లో ఇజ్రాయిల్ సమర్థించింది. అయితే వెస్ట్‌బ్యాంక్‌కు ఇది వర్తించదంటూ మెలిక పెట్టింది. గాజా స్ట్రిప్‌లో బాలల హక్కుల ఉల్లంఘనలు తరచూ చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఐరాస నడుపుతున్న పాఠశాలలు సహా విద్యకు సంబంధించిన మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. చిన్నారులపై యథేచ్ఛగా బాంబు దాడులు జరుగుతున్నాయి. మానవ హక్కులకు సంబంధించిన ఐరాస తీర్మానాలపై ఇజ్రాయిల్ 1991 వరకూ సంతకమే చేయలేదు. పైగా పాలస్తీనా ప్రజల హక్కులను నిరాకరిస్తూ 2018లో ఓ చట్టాన్ని తీసుకొచ్చింది.

#### రోజుకు 170 మంది చిన్నారులు బలి

గాజాపై యుద్ధం చేసిన 40 రోజులలో ప్రతి రోజూ ఇజ్రాయిల్ 170 మంది చిన్నారులను పొట్టనపెట్టుకున్నదని అల్ జజీరా ఛానల్ తెలిపింది. చిన్నారులకు గాజా స్మశానవాటిక అయిందని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుట్టెరస్ నవంబర్ 6న ప్రకటించారు. జరుగుతున్న దారుణాలకు ఇజ్రాయిల్‌ను బాధ్యురాలిని చేయడంలో ప్రపంచదేశాలు విఫలమయ్యాయని పాలస్తీనియన్ క్రానికల్ పత్రిక ఆరోపించింది. మొత్తంమీద మానవ హక్కుల డిక్లరేషన్ల ఉనికిని నాశనం చేసేందుకు బాంబు దాడులు జరుగుతున్నాయి. ఆ డిక్లరేషన్లు చిన్నారుల మృతదేహాలతో నిండిపోయిన గాజా శిథిలాల కింద తగలబడుతున్నాయి.

## యాదాద్రిలో కిక్కిరిసిన భక్తులు..రికార్డు స్థాయిలో ఆదాయం

యాదాద్రి - ప్రభాత సూర్యుడు

యాదాద్రి జిల్లాలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. స్వామి వారిని 70 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. దీంతో ఒక్కరోజే రూ. కోటి 9లక్షల ఆదాయం సమకూరిందని తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ. 5,20,800, కైంకర్యాల ద్వారా రూ. 2,500, సుప్రభాతం ద్వారా రూ. 23,700, బ్రేక్ దర్శనం వల్ల రూ. 10,85,400, వ్రతాల ద్వారా రూ. 12,46,400 ఆదాయం వచ్చిందని వెల్లడించారు. వాహన పూజల ద్వారా రూ. 24,400, వీఐపీ(%ఎఖ%) దర్శనం ద్వారా రూ. 23,85,000, ప్రచారశాఖ ద్వారా రూ.1,31,679, పాతగుట్టలో పూజల ద్వారా రూ. 3,29,200, కొండపైకి వాహన ప్రవేశాల ద్వారా రూ. 8 లక్షలు వచ్చిందని వివరించారు. యాదఋషి నిలయం ద్వారా రూ. 3,73,792, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ. 2,91,096, శివాలయం ద్వారా రూ. 16,500, పుష్కరిణి ద్వారా రూ. 4,200, ప్రసాదవిక్రయం ద్వారా రూ. 34,31,490 వచ్చిందని వివరించారు. శాశ్వత పూజలు ద్వారా రూ. 42,500, కల్యాణ కట్ట ద్వారా రూ. 1,91,900 , అన్నదానం ద్వారా రూ. 28,611, గది విరాళం ద్వారా రూ.11,700 ఆదాయం ఆలయానికి సమకూరిందని వివరించారు.

### ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా
# విష్ణుదేవ్ సాయ్..!




**రాయ్‌పూర్ - ప్రభాత సూర్యుడు:** ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా విష్ణుదేవ్ సాయ్‌ని బీజేపీ ఎంపికచేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆదివారం సమావేశమైన బీజేపీ ఎమ్మెల్యేలు శాసనసభా పక్ష నేతగా మాజీ కేంద్రమంత్రి విష్ణుదేవ్ సాయ్‌ని ఎన్నుకున్నట్లు తెలిపాయి. ఆయన గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ పనిచేశారు. ఛత్తీస్ గఢ్ మాజీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్‌కు సన్నిహితుడు.

## వెస్టిండీస్ టీ20 జట్టు ప్రకటన.. ఆండ్రీ రస్సెల్ రీ ఎంట్రీ




**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు 15 మంది సభ్యులతో కూడిన జట్టును తమ జట్టును క్రికెట్ వెస్టిండీస్ ప్రకటించింది. స్టార్ ఆల్ రౌండర్ ఆండ్రీ రస్సెల్‌కు ఇంగ్లండ్ సిరీస్ కోసం విండీస్ సెలక్టర్లు పిలుపునిచ్చారు. ఇంగ్లండ్‌తో వన్డేలకు దూరమైన స్టార్ ఆటగాళ్లు జాసన్ హోల్డర్, నికోలస్ పూరన్‌లు టీ20 జట్టులో చోటు దక్కించుకున్నారు. ఈ జట్టుకు రోవ్‌మన్ పావెల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. షారు హోప్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. డిసెంబర్ 12న బార్బోడేస్ వేదికగా జరగనున్న తొలి టీ20తో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఇంగ్లండ్‌తో టీ20లకు విండీస్ జట్టు: రోవ్‌మన్ పావెల్ (కెప్టెన్), షారు హోప్ (వైస్ కెప్టెన్), రోస్టన్ చేజ్, మాథ్యూ ఫోర్డ్, షిమ్రాన్ హెట్‌మెయర్, జాసన్ హోల్డర్, అకేల్ హొసేన్, అల్జారీ జోసెఫ్, బ్రాండన్ కింగ్, కైల్ మేయర్స్, గుడాకేష్ మోటీ, నికోలస్ పూరన్, ఆండ్రీ రస్సెల్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, రొమారియో షెపర్డ్.

## కొత్త కురుమ మంగమ్మ శివకుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**తుర్కయంజాల్- ప్రభాత సూర్యుడు :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ శివకుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి , టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తన్నీరు హరీష్‌రావును కలిసిన నల్లోల పాండు



రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండల బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నల్లోల పాండు వరుసగా ఏడవ సారి సిద్దిపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

**- అబ్దుల్లాపూర్ మెట్, ప్రభాత సూర్యుడు**

# 'గ్యారెంటీ'లేదన్న పెద్దలకు చెంపపెట్టు

**ఖమ్మం- ప్రభాత సూర్యుడు**



ఆరు గ్యారంటీకు వారెంటీ లేదన్న పెద్దలకు చెంపపెట్టుగా ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేశామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదింట తొమ్మిది నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ను గెలిపించి, రాష్ట్రంలో అధికారంలోకి తీసుకొచ్చిన తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి తొలిసారి ముగ్గురు మంత్రులు ఆదివారం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా నాయకన్‌గూడెం వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వారికి ఘనస్వాగతం పలికారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిధిని రూ.10లక్షలకు విస్తరింపజేస్తూ కూసుమంచి మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రారంభించారు. అనంతరం ఖమ్మం పాతబస్టాండ్‌లో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ 'మహాలక్ష్మి' పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాను కలిసి ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లామని, ప్రతి ఇంటికీ చేరేలా మేనిఫెస్టోలో పొందుపర్చామని తెలిపారు. నాటి ప్రభుత్వ పెద్దలు ఆరు గ్యారంటీలకు వారెంటీ లేదని ఎద్దేవా చేశారని, కానీ ఇప్పటికే రెండు గ్యారంటీలను అమల్లోకి తెచ్చామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలకు అంకితం చేశామని, తమదీ ప్రజా ప్రభుత్వంగా అభివర్ణించారు. సంపదను సృష్టించడంతో పాటు దాన్ని ప్రజల కోసం వెచ్చిస్తామని స్పష్టంచేశారు. ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ అన్ని అవకాశాలు ఉంటాయని, పోడు భూముల సమస్య, ఇండ్లు లేని వారికి గృహాల నిర్మాణం, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంత్రి పొంగులేటి, తుమ్మల మాట్లాడుతూ.. తమదీ ప్రజల తీర్పును అర్థం చేసుకునే ప్రభుత్వమని, వారిలో విశ్వసనీయతను నిలుపుకుంటామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఖజానా మొత్తం ఖాళీ చేసి, రూ.5.50 లక్షల కోట్ల అప్పుతో తమకు పాలనను అప్పగించిందన్నారు. అయినా తాము హామీ ఇచ్చిన గ్యారంటీలను తప్పక అమలు చేస్తామన్నారు. రూ.85వేల కోట్ల అప్పుతో విద్యుత్‌శాఖను మల్లు భట్టి విక్రమార్కకు అప్పగించారని, ఆర్థిక, విద్యుత్‌శాఖలనే రెండు ముళ్ల కిరీటాలను ఆయన భరించాల్సి ఉందన్నారు. వక్ఫ్‌భూములు, ఇతర భూములు, ధరణి సమస్యలను తీర్చి రైతులకు భరోసా ఇచ్చేలా మంత్రి శ్రీనివాసరెడ్డికి రెవెన్యూ, గృహ శాఖలను ఇచ్చారన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం నీటితో ఉమ్మడి జిల్లాలో ఆరు లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేసి తన వ్యవసాయశాఖను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తానని చమత్కరిస్తూ మాట్లాడుకొచ్చారు. ఏ స్వేచ్ఛాయుత జీవనాన్ని కాంక్షించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారో.. దానిని నెరవేర్చుతామని తెలిపారు. కబ్జాకోరులు, దందాల నుంచి విముక్తి కల్పించి ప్రశాంత ఖమ్మాన్ని స్థాపిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఖమ్మం జిల్లా నుంచి తొలిసారి ముగ్గురు మంత్రులుగా నియమితులైన నేపథ్యంలో వారికి ఆదివారం జిల్లా శివారు నాయకన్‌గూడెం నుంచి ఘనస్వాగతం లభించింది. భారీ గజమాలతో అభిమానులు మంత్రులను స్వాగతించారు. నాయకన్‌గూడెం, కూసుమంచి, వరంగల్ క్రాస్‌రోడ్డు ప్రదర్శన సాగింది. ఖమ్మంలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పినపాక, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, మద్ది శ్రీనివాసరెడ్డి, డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావీద్, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రులకు ఛాంబర్స్ కేటాయింపు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆయా శాఖల మంత్రులకు ఛాంబర్స్ కేటాయిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్కకు సచివాలయంలోని రెండో అంతస్తులో 10,11,12 గదులను కేటాయించారు. ఇరిగేషన్, పౌరసరఫ రాల శాఖ శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డికి నాల్గవ అంతస్తులో రూమ్ నెంబర్లు 27, 28, 29 కేటాయించారు. ఆరోగ్యం, కుటుంబసంక్షేమం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర రాజనర్సింహాకు రెండో అంతస్తులో 13,14,15 గదులు కేటాయించారు. రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఐదో అంతస్తులో 10,11,12 రూంలు కేటాయించారు. ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధరబాబుకు మూడో అంతస్తులో 10, 11, 12 నెంబర్ల గదుల్ని కేటాయించారు. రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి గ్రౌండ్ ఫ్లోర్‌లో 10, 11, 12 నెంబర్ల రూములు ఇచ్చారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఐదో అంతస్తులో రూం నెంబర్లు 27, 28, 29 కేటాయించారు. పర్యావరణం, దేవాదాయ, అటవీశాఖల మంత్రి కొండా సురేఖకు నాల్గవ అంతస్తులో 10, 11, 12 నెంబర్ల రూములు కేటాయించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డీ అనసూయ సీతక్కకు మొదటి అంతస్తులో 27, 28 29 గదుల్ని కేటాయించారు. వ్యవసాయం, మార్కెటింగ్, సహకారం, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మూడో అంతస్తులో 27, 28, 29 గదుల్ని ఇచ్చారు. మద్యపాన నిషేధం, ఎక్సైజ్, సాంస్కృతిక, పర్యాటక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావుకు నాల్గవ అంతస్తులో 13, 14, 15 నెంబర్ల గదుల్ని కేటాయించారు. ఈ సమాచారాన్ని ఆయా శాఖలు, విభాగాల ఉన్నతాధికారులకు అందించారు.

# అంజనాద్రిలో పోచమ్మ దేవాలయం ప్రారంభించిన సిపిఐ నాయకులు



**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు**

పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధి 12వ వార్డు అంజనాద్రి నగర్ లో ఆదివారం సిపిఐ నాయకులు ఆందోజు రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్ అభ్యర్థి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరి సింగ్ నాయక్ లు నూతనంగా శ్రీ శ్రీ పోచమ్మ దేవాలయాన్ని ప్రారంభించి విగ్రహ ప్రతిష్టాపన చేశారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ అసోసియేషన్, ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ సహకారం అందించి, ప్రత్యేక చొరవ చూపారని అన్నారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టామని తెలిపారు. అనునిత్యం అమ్మవారికి పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం రాజు, రాజేందర్, రాధ, కృష్ణ, సుధాకర్ రెడ్డి, రమేష్ రెడ్డి, విష్ణు, నాగపురి రమేష్, మల్లేష్ యాదవ్, చంద్రశేఖర్, శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### ఘోర రోడ్డు ప్రమాదం

## 8 మంది సజీవ దహనం



ఉత్తరప్రదేశ్- ప్రభాత సూర్యుడు

ఉత్తరప్రదేశ్‌లోని భోజీపురాలో తీరని విషాదం నెలకొంది. కారు-ట్రక్కు ఢీకొన్న ఘటనలో చిన్నారి సహా 8మంది సజీవ దహనమయ్యారు. బాధితులు ఓ వివాహానికి హాజరై వస్తుండగా శనివారం రాత్రి బరేలీ జాతీయ రహదారిపై జరిగిందీ ఘటన. ప్రమాదం తర్వాత కారు సెంట్రల్ లాక్ పడిపోవడంతో లోపలున్నవారు తప్పించుకునే మార్గం లేకుండా పోయింది. కారు టైరు పేలిపోవడంతో అదుపుతప్పి అవతిలి రోడ్డులోఉత్తరాఖండ్ నుంచి ఇసుకతో వస్తున్న ట్రక్కును ఢీకొట్టి నుజ్జునుజ్జు అయింది. కారును ట్రక్కు కొంతదూరం ఈడ్చుకెళ్లడంతో మంటలు చెలరేగాయి. కారుడోర్లు లాక్ కావడంతో లోపల ఉన్నవారు తప్పించుకోలేకపోయారు. మంటల్లో అందరూ సజీవ దహనమయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారు నుంచి చిన్నారి సహా ఏడుగురి మృతదేహాలను బయటకు తీశారు. బాధితులను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## ఫిలింనగర్‌లో హాష్ ఆయిల్ విక్రయిస్తున్న ముఠా అరెస్టు



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** ఫిలింనగర్ పరిధిలో హాష్ ఆయిల్, చరస్‌ను విక్రయిస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఏడుగురు సభ్యుల ముఠాను ఆదివారం పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్టు చేసి ఫిలింనగర్ పోలీసులకు అప్పగించారు. నిందితుల నుంచి 310 మి.లీ హాష్ ఆయిల్, 70 గ్రాముల చరస్, ఒక వాహనంతో పాటు 8 చరవాణులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు అరకు నుంచి తక్కువ ధరకు తెచ్చి నగరంలో నిషేధ మాదకద్రవ్యాలను విక్రయిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ దాదాపు రూ. 2. 28లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు.

## రాజకీయ వారసుడిని ప్రకటించిన మాయావతి

**లక్నో - ప్రభాత సూర్యుడు :** 2024 సార్వత్రిక ఎన్నికల ముందు బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధ్యక్షురాలు మాయావతి తన మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌ను రాజకీయ వారసుడిగా ప్రకటించారు. ఆదివారం లక్నోలో జరిగిన పార్టీ సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఆకాష్ ఆనంద్ మాయావతి తమ్ముడి కుమారుడు. 2019లో ఆకాష్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పార్టీ తరపున ప్రచారం కూడా చేపట్టారు. అదే సమయంలో ఆయనను బిఎస్‌పి జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించారు. గతేడాది నుండి పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. 2016లో బిఎస్‌పిలో చేరిన ఆకాష్ మాయావతి తర్వాత పార్టీలో అధిక ప్రాధాన్యం కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. 2022లో రాజస్థాన్‌లోని అజ్మేర్‌లో పార్టీ వర్గాలు చేపట్టిన పాదయాత్రతోపాటు, ఇటీవల డా. బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా చేపట్టిన స్వాభిమాన్ సంకల్ప్ యాత్రలో కూడా ఆయన కీలకంగా వ్యవహరించారు. దేశవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసే బాధ్యతను ఆకాష్‌కు అప్పగించారని బిఎస్‌పి నేత ఉదయవీర్ పేర్కొన్నారు. మాయావతి తర్వాత ఆకాష్‌ను రాజకీయ వారసుడిగా ప్రకటించారని అన్నారు.

## ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెల్పిన ఆసిఫ్ అలీ

**ఆమనగల్- ప్రభాత సూర్యుడు :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి రేవంత్ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షులు ఆసిఫ్ అలీ శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ విజయఢంకా మోగించడంతో పాటు ముఖ్యమంత్రిగా



రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆదివారం హైదరాబాద్ లోని తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపినట్టు రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షులు ఆసిఫ్ అలీ తెలిపారు.

# అధికార పక్షమైనా ప్రతిపక్షమైనా ప్రజల పక్షాననే ఉంటాం

## బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

ఇబ్రహీం పట్నం- ప్రభాత సూర్యుడు




బొంగ్లుర్ లోని కళ్లెం జంగారెడ్డి గార్డెన్స్‌లో ఇబ్రహీం పట్నం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన పార్టీ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి , మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) మాట్లాడుతూ జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మంచిరెడ్డి కిషన్ రెడ్డిని గెలిపించేందుకు రాత్రి అనక ,పగలనక, కుటుంబాలకు దూరంగా ఉంటూ కృషిచేసిన నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియ జేశారు. బిఆర్ఎస్ పార్టీకి, మంచిరెడ్డి కిషన్ రెడ్డికి 89806 ఓట్లు వేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. మన వంతు మనం ప్రయత్నం చేశాము. ఫలితం రాలేదు. ఏమి అధైర్య పడొద్దని నాయకులకు కార్యకర్తలకు సూచించారు. ఎన్నికలలో గెలుపు, ఓటమిలు సహజమని ఎవరు నిరాశ చెందోదని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అంటేనే ఉద్యమ పార్టీ. పోరాటాలకు పెట్టింది పేరని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రజల పక్షాన పోరాటం చేస్తాం. ప్రజలకు అండగా నిలబడతామని కార్యకర్తలకు సూచించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజలు మూడుసార్లు అవకాశం ఇచ్చినందుకు రుణపడి ఉంటా. 2931 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలతో అమలు చేయకుంటే ప్రజల పక్షాన నిలబడి ప్రతిపక్ష పాత్ర పోషిద్దామని ప్రజల గొంతుకై బలంగా పోరాటం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి), జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏరుపుల చంద్రయ్య, ఎంపీపీ కృపేష్, ఆకుల యాదగిరి,వంగేటి లక్ష్మారెడ్డి, చిలకల బుగ్గ రాములు, జడ్పిటిసి చిన్నోళ్ల జంగమ్మ యాదయ్య, రమేష్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం మహెూత్తరమైనది

### ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి




**ఇబ్రహీం పట్నం: - ప్రభాత సూర్యుడు :** ప్రజా ప్రభుత్వం అంటే ఏమిటో రెండు రోజుల్లోనే రాష్ట్ర ముఖ్యమంత్రి నిరూపించారని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేయ తలపెట్టి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒకటైన మహాలక్ష్మి, పథకాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలందరికీ రాష్ట్ర ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ఇబ్రహీంపట్నం కేంద్రంలోని బస్టాండ్ లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రగతిభవన్ గడీలను బద్దలు కొట్టి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు రెండు రోజుల్లోనే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయడం జరిగిందని,ఆర్టీసీ బస్సులలో మహిళలందరూ ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు. మహాలక్ష్మి పథకం పట్ల మహిళలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మహిళలందరికీ ఎంతో ఉపయోగపడే ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రాబోయే రోజుల్లో మహాలక్ష్మి పథకం కింద కొత్త బస్సులు ఏర్పాటు చేసే ఆలోచనలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నారని, సంక్రాంతి నాటికి కొత్త బస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇది మహిళలకు ఇచ్చిన కానుక అని తెలిపారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతి చందు,ఈసీ శేఖర్ గౌడ్, భూపతి గల మహిపాల్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కొత్త కురుమ మంగమ్మ శివకుమార్ ఆధ్వర్యంలో

# 21 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్న ప్రజలు

**-కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన శుభ సందర్భంగా**

**-21 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్న మున్సిపాలిటీ ప్రజలు**

**తుర్కయంజాల్: - ప్రభాత సూర్యుడు:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన శుభ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అత్యధిక మెజారిటీతో గెలుపొందిన సందర్బంగ తుర్కయంజాల్ కట్ట మైసమ్మ దేవస్థానం వద్ద తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్ ఆధ్వర్యంలో 21 బొబ్బరి కాయలను కొట్టి మొక్కు తీర్చుకున్న తుర్కయంజాల్ మున్సిపాలిటీ మహిళలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుడ్ల అర్జున్, ఎరుకలి రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215